అంతదాకా తండ్రి పోయినందుకు ఏడవని అతనికి దుఃఖం కట్టలు తెంచుకుని వచ్చింది. భోరున ఏడవసాగాడు.

నీతి: దేవుడు మనకిచ్చే బహుమతులని మనం ఎన్నోసార్లు, వాటి అంతరార్థాన్ని తెలుసుకోకుండా తిరస్కరిస్తూంటాం.

## 52. క్షమ విలువ

ఓ ఆధ్యాత్మిక గురువు తన శిష్యులని కొంతకాలం గమనించాక వారికో నీతిని బోధించదలచాడు.

ఓ రోజు వారినందరినీ పిలిచి చెప్పాడు.

"మీరు ఒకొక్కరూ ఎంతమందిని ద్వేషిస్తున్నారో అన్ని ఉడికిన బంగాళా దుంపలని వంటశాలలోకి వెళ్ళి తీసుకురండి."

వాళ్ళంతా కొద్దిసేపట్లో బంగాళాదుంపలతో వచ్చారు. అందరికీ గురువుగారు తలో చేతి సంచీ ఇచ్చి చెప్పారు.

"మీ బంగాళాదుంపలన్నింటిని ఈ సంచీల్లో నింపుకోండి."

కొందరు ఒకటి, కొందరు రెండు, మరికొందరు మూడు, ఇంకొందరు నాలుగు... ఇలా వాళ్ళంతా తాము తెచ్చిన బంగాళాదుంపలని తమకిచ్చిన ఆ సంచీల్లో నింపాక వారితో చెప్పాడు.

"మీరంతా ఓ వారంపాటు ఈ సంచీలని మీతోనే ఉంచుకోవాలి. అఖరికి మీరు బహిర్భూమికి వెళ్ళినా ఈ సంచీలని మీ వెంటే తీసుకెళ్ళాలి. వారం తర్వాత మళ్ళీ నాకు కనబడండి."

ఆ ప్రకారం శిష్యులు ఆ సంచీలని ఎల్లప్పుడూ తమ వెంటే ఉంచుకోసాగారు. రోజులు గడిచేకొద్దీ ఆ సంచీల్లోంచి చెడువాసన రాసాగింది. అంతేకాక ఆ సంచీలు బరువుగా తోచసాగాయి. వారం ఎప్పుడు పూర్తవుతుందా అని భారంగా ఎదురుచూసిన ఆ శిష్యులు వారాంతంలో గురువుగారి దగ్గరకి వెళ్ళారు. అయన వాళ్ళవంక వాత్సల్యంగా చూస్తూ అడిగాడు.

"వారంరోజుల పాటు బంగాళాదుంపల సంచీని మోసిన అనుభవం ఎలా ఉంది మీకు?"

వెంటనే శిష్యులంతా ఆ వారంపాటు ఆ బరువైన, వాసనవేసే బంగాళాదుంపల సంచీలని మోయడంలోని బాధని ఏకరువు పెట్టారు.

అప్పుడు గురువు వాళ్ళతో ఇలా చెప్పాడు.

"ఇతరులమీద మీరు పెంచుకున్న ద్వేషాన్ని మీ హృదయంలో మోస్తున్నప్పుడు కూడా జరిగేది ఇదే. ఆ ద్వేషం తాలూకు చెడు వాసన, బరువు మీ హృదయాన్ని పాడు చేస్తాయి. ఒక్క వారం రోజులే మీరు బంగాళాదుంపలని భరించలేక పోయారు. మరి జీవితాంతం ఇతరుల మీద మీకు గల ద్వేషం బరువు, వాసనలని ఎలా భరించగలరు? మన శతృవులని క్షమించడమంటే మనం వారికి సేవ చేయడం కాదు. మనకి మనమే సేవ చేసుకోవడం. మనల్ని మనమే ఉద్ధరించుకోవడం."

శిష్యులకి అంతకాలం, తమ గురువు పదే పదే క్షమాగుణం గురించి బోధించిందంతా ఒక్క క్షణంలో అర్థమైంది. ఆ తర్వాత వారంతా తమకి ద్రోహం చేసిన వారందరి మీదా గల ద్వేష భావాన్ని క్రమంగా పోగొట్టుకున్నారు.

## 53. ప్రత్యేక గారెలు

ఓ గ్రామ సమీపంలోని ఓ అడవిలో ఒక ఆధ్యాత్మిక గురువు ఉండేవాడు. ఆయన దగ్గర అనేకమంది శిష్యులు సాధన చేస్తూండేవారు.

ఏటా ఆ ఊళ్ళో ఓ ఉత్సవం జరుగుతుంది. దానికి అనుబంధంగా అనేక వినోద కార్యక్రమాలు కూడా జరుగుతూంటాయి. శిష్యులు ఆ ఉత్సవం చూడాలనుకున్నారు కాని, అక్కడ దొమ్మరిసాని ఆటలు కూడా జరుగుతూండటంతో ఆ గురువు వాళ్ళని అక్కడకి వెళ్ళడానికి అనుమతించలేదు.